# పరిశిష్టం

ఊరూనాడూ ఏకక్ఠోడిగ అదే కూత! మీసకట్టు కూడారాని వయసులో ముక్కుపచ్చలారకముందే యింత-టన్నుల బరువైన అపవాదు ఈ అర్భకుడిమూపున కట్టబెట్టడం కన్నా ఒక చిన్నదాన్నే కట్టబెట్టడం సబబనుకొని పెద్దలు నలుగురూ నిశ్చయించుకొన్నారు. ఇంతకూ రామ రామ! ఈ తప్పుణ్యం! అయితేనేం? పెద్దలు తల్చుకొన్నది ఊరకపోతుందా? 'శుభం' అని ఆ నాలుగు అక్షింతలూ జల్లి యెవరి మార్గాన వాళ్లు తప్పుకున్నారు. అంతా అలనాటి గాథ.

మధుపర్కాలతో పాటు నాటికి నేడు ఆకథ పైకొచ్చింది. అయినవాళ్ళింటి అయిదురోజుల పెళ్ళి. భూదేవంత అరుగు. ఆకాశమంత పందిరి. వున్నంతలోనే కానిచ్చి మహేంద్ర వైభవంతో పరగణాపరగణా అంతటికీ కన్నులపండువుగా కానిస్తున్నారు. మన రాయడు నాటికి ముందు మనువిచేసుకున్న చిన్నవాడు. దేవదుందుభులు మ్రోగుతున్నాయి. దేవరంభ బంధుమిత్ర పరివార సమేతంగా విచ్చేసి గజ్జెకట్టింది. నిత్య కళ్యాణం ఘణుతెగరకొడుతున్నది.

మన రాయడు తన వయసువాళ్ళతో గోలీ లాడుకోకుండా నట్టువరాళ్ళ విడిదిపడిముందు జీతంబత్తెం లేకుండా కాపువేశాడు. ఈ మామూలువింతని ఓ కంటకనిపెట్టే పండు బుర్రలు ఆనాటికింకా హారాయసలేదు, తాతయ్యా ఆ నాటకం ఇల్లే పోల్చుకున్నాడు. అయినా 'అబ్బీ ఓపికపట్టు. ఇది నడి వయసు మీసాలను తప్పని ఖర్మం' అన్నసాపాన పోతాడా?

పోతే ఆ హాజారంలోంచి మొదటికే మోసంవచ్చి తనకే దేవిడీ మన్నా. తాతయ్య శతాధికగ్రంథసాంగుడు. ప్రపంచంలో లెక్క తేలని వివరాలలో యిలిగాడి ఘనకార్యాలు ఒకపద్దు. దేశం యీ కొస్తానుంచీ ఆ సరిహద్దువరకూ అంతా సర్వం అతని కరతలామలకం. తల నెరిసినా తలుపులు నిత్యనచ్చగా ఒకటే దూకుడు. చేతలకి ఓపిక లేకపోయినా ఇప్పుడు మాటల కేంకొదవ! తాతయ్య ప్రోక్తంగాని లాస్యం ఆ గడ్డమీద తల నెరిసిన ఆ వయసునాటికే చెల్లనిసంగతి. పై పెచ్చు యీ విడిదిచేసినవారా — ఇలవేల్పులు—వంశస్త్రీలు ఏనాడో ఇతనిముందు అచ్చంగా—ఒంటరిగా గజ్జెకట్టి: విడెమిచ్చి తిరించినవాళ్లు. నాయకసానికి వయస్సంటే మళ్ళింది కాని, జ్ఞాపకశక్తి పోలేదు. అందుకే ఆ అయిదువరాలూ, ఈ నిత్యబాల సాపతూ ఎడనెడ ప్రపంచాన్ని దాని మానాన్న తిరగనిచ్చి అలనాటి ఆకుపచ్చని సంగతులు ఉమ్మడిగా నెమరు వేస్తున్నారు.

ఇంతలోకే యీ చోద్యం ముసిలిముక్కలకు గుప్పున వాసనకొట్టింది. మనరాయడు ఆ చుట్టుపక్కల తచ్చాడుతూ, తాతయ్య ఏమనిపోతాడో అని నక్కుతూ ఇలా — వెలితిపడిపోయాడు. ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టగల ఆహితాగ్ని మన బాలకుమారునిచేత పొరపాటునైనా 'మనమా—వదిలక — నాదుమాట వినుమా' అని వల్లెవేయించుతాడా? సరసకు రమ్మన్నాడు. ముత్తయిదువ ఇట్టే పసికట్టి వల్లమాలిన సంబరపడ్డది. తాతయ్యదగ్గరకు అర్భకుడు అణిగిమణిగి అడు

గులు కొలుచుకోవటంతప్ప మరేం చేతకా దన్నట్టు వచ్చేశాడు.

తాతయ్య పూరుకుంటాడా? 'ఒరే, నాయనా! అలా దిగాలుపడటం ఈ పొలిమేరలకే సిగ్గుచేటు. అల్లసాని పెద్దన్న అన్నాడులే – ఆ సంగతి తరువాత విడమర్చి చెప్తాను – తలెత్తి తిరుగు. మగరాయుడివయినందుకు మన్వంతలోనే లేని మీసంమీద చేయివేసి ఛాతీవిరుచుకొని తిరుగు. మనలో మనమాట – ఏ వయ్యారి అదృష్టం పండింది అని వాకబు చేశాడు.

మనవాడు గాలిబుంగలా పొంగి అంతలోనే కొత్త మతానికి యిమడలేక తెల్లముఖం వేశాడు. తాతయ్య కేదీ కొత్తకాదు. 'అయితే అబ్బీ, తీరా ఆ చిన్నది – ఊ–అన్నాక అంటే–నడుచుకోనేతీరు తెలుసా? ఎలా పలకరిస్తావో, ఎలా పులకరిస్తావో–ఎందుకైనా మంచిది, ముందే నేర్చుకో. మీ నాన్న వట్టి ఛాందసుడు. పిల్లవాళ్ళకి యీనాటినుండీ తర్ఫీదు యివ్వకపోతే ఏం బాగుపడతారు? చూడూ, యిదుగో ముందు 'యిలాగ' అని ప్రక్కనున్న పండుముత్తయిదువ బుగ్గమీద చిటికివేసి ప్రథమపాఠాలు మొదలెట్టేడు. అంతఆటవెలదీ ఆ చీకట్లో పన్నెండేండ్ల బాలకుమారి అయి, సొట్టపడినబుగ్గలు మరీ సొట్టబడ్డాయి. ఆ బుగ్గలలోనే పేదరాశిపెద్దమ్మ కుంకం ఎండబోసింది. ఈ అబ్బురం పర్యవసానం మూడోకంటివాడి కెందుకు తెలియాలని మనవాడు లోపలికి తప్పుకున్నాడు.

లోపల అంతా పచ్చి – తీపి కల. వయసువారి చిలుకలు. గతంరాత్రి మేళానికి అలసిపోయి మధ్యాహ్నం మేజు

వాణికి ఆయ తపడుతున్నారు. మరీ చింత - చావని కాలం. విద్య చూపెట్టి మెప్పుపొంది ఆపేమ్మాట కుల - ఆనవాయితీ. ఒంటినిండా ఆభరణాలతో పాటు నిండు-నీళ్ళ-గళాసులు పెట్టుకొని తొణకకుండా పళ్ళెంమీద విలబడి రకరకాలుగా వంగి నాట్యమాడడం నాటి మధ్యాహ్నపు కార్యక్రమం. మనవాడి కన్నుల కొక్క-చిన్నది అంతపనినీ ఎందుకేనా మంచిది వళ్ళు స్వాధీనంలో వుంచకపోతే ఎలా గని పునః - సాధకం చేస్తున్నాది. ఈ సాముగరిడీలు - హొయలు తదేకనిష్టతో చూసి చూసి మనవాడు అలా వుండిపోయాడు. వాడి చెవుల్లో క్రితం రాత్రి ఆ అమ్మాయి అభినయించిన 'ఫలానావారి చిన్నదిరా, అది నిన్నే కోరియున్నదిరా' అన్న జావళీ హోరుపెట్ట యీ సాధకం యావత్తూ తన మెప్పుకోసమే అనుకొన్నట్లు చేసింది. వెయ్యిమంది సరసులచేతులలో తానొక్కడూ చప్పట్లుగొట్టి అలసిపోయి అంతలో తేరుకుని కొత్తపెళ్ళికూతురులాగ సిగ్గుపడి కుప్పకూలిపోయాడు.

నాయకసాని ఎప్పుడు ఉప్పు అందించిందో, నట్టువరాలు చడీచప్పుడూ లేకుండా అతగాడి చేయిపట్టుకొని లోపలికి లాక్కెళ్ళి గది బిడాయించింది. గజ్జెలూ ఆభరణాలు ఒలిచి సేదదీరడానికి కుశలప్రశ్నలు వేసింది. 'అబ్బాయీ! నీ పేరేంపేరు?' అంటూ. మనవాడికిఒళ్ళు చచ్చినంత పని అయింది. ఇంత అవమానమా?

నట్టువరాలు ఆమాత్రం గ్రహించకపోలేదు. 'ఏం అబ్బాయీ అన్నానని కోపమా? పోనీలే ఏమనిపిలవమన్నావ్? తాతా అనేదా! మళ్ళా కోపమే! సరే' అని మనవాడి ముంగు

రులు దువ్వి లాలించింది. ఉబలాటమేగాని ఎలా మసులుకోవాలో తెలిసేవయస్సా? అందుకే నాటకం అంతా ఏకపాత్రాభినయం. మనవాడు అక్కున చేరిన మచ్చిక - జీవిలా చెప్పినట్టు నడుచుకున్నాడు.

జవరాలు ఆ కుర్రాడి సరదాని చూసి ఆ చూరుకింద వున్నన్నాళ్ళూ వెంటతిరిగేందుకు అనుమతి మంజూరుచేసినది. మనవాడు కంటికి రెప్పఅయినాడు. వియ్యాలవారి మరియాదలు ఈ విడిదిలో ఏం లోపం లేకుండా చూచుకున్నాడు. జవరాలు తీరుబాటుచేసుకుని మేళానికి వెళ్ళేముందు మనవాడికురులు దువ్వి ముస్తాబుచేసి ముచ్చటపోయింది.

తాతయ్య యిదంతా చూసి కనీసం ఒకడినేనా తనంత వాడిని చేస్తూన్నందుకు మహదానందపడ్డాడు. మేళంలో కుర్రాడిని తనప్రక్కనే కూర్చోపెట్టుకున్నాడు. అయినవాళ్ళు యీ కూడనిపనికి అడ్డుచెప్పలేకపోయారు. అన్ని గుండెలు ఎవరి కున్నాయి!

జవరాలు తన ఉబుసుపోకకు మనవాడిని మన్నించింది. కానీ, వాడితోనే లోకమా? పందిరిలో మఠంవేసుకొన్న అడ్డమైనవాళ్ళముందూ 'మందారగంధ మిదే, మనోహరా పూసెదరా' అని అభినయం పట్టకతప్పుతుందా? ఈ బాహుపోటు పసిగుండె ఎలా సహించుతుంది? అదిమిపట్టుకొన్న తాతయ్యను విదిలించుకొని దూకుడుగా లేచిపోయాడు. ఈ చేష్ట కావలసినవాళ్లు కనిపెట్టక పోలేదు.

కుర్రాడు అలా లేచి తిన్నగా మేళంవిడిదిలోకే - జవరాలి తలగడతో ఫిర్యాదు చేసుకొన్నాడు. ఇంత నమ్మక

ద్రోహంవుంటుందా? తాతయ్య జవరాలికి ఏం నచ్చచెప్పాడో, ఆఖరినాటిరాత్రి పెద్దమనుష్యులందరి సమక్షంలోనూ జవరాలు మనవాడిముందు మనస్ఫూర్తిగా అభినయం పట్టింది. వేలెడు కుర్రాడిమునదు యీ చోద్యమేమటని నడివయస్సు మీసాలన్నీ ముక్కుమీద చెయ్యివేసుకున్నాయి. జవరాలు అభినయం పూర్తిచేసి కట్నానికి పట్టుపట్టింది. మనవాడు కట్నమేమిచ్చుకుంటాడు?

ఇచ్చేదాకా అభినయం మాననని జవరాలు భీష్మించుకొంది. అదేపనిగా పావుగంటసేపు ఒకటే అభినయం. మనవాడు నాటికి కొన్ని దశాబ్దాల అనుభవంవున్నవాడిలా ధీమాగా తాతయ్యఅండ అవ్యక్తంగా చూచుకొని కూర్చున్నాడు. ఈ అబ్బురం విని కుర్రాడినాన్న వచ్చి కూకలు వేసినంత నవ్వుకొన్నాడు. అభినయం పట్టించి కట్నంయిచ్చే దమ్ములు తనకు లేకపోయినా తనతండ్రి పరువును తనకొడుకు నిలబెట్టినందుకు కాక విధిలేక జవరాలికి కొడుకు చేతిమీదుగా కట్నం యిప్పించేడు.

తాతయ్య ఒకంతట సబబుగా కట్న మిప్పిస్తాడా వాలుముగ్గ వేసి కుర్రాడిమో చేతిమీదుగా కట్నాన్ని నోటితో అందుకో అని పేచీపెట్టాడు. పరీక్షని జవరాలు యిట్టేనెగ్గి-కట్నాన్ని నోటకరచుకొంది.

ఇంటిలోనే వూరూనాడూ ఏకమై నాటికి ఐదుకోజు లాయిపట్టించుకొని కుర్రాడి దినచర్యను కూపీతీసి కాలం చెడిపోయిందని ఆడిపోసుకున్నారు.

జవరాలు తన మానాన తను గజ్జెలు దులుపుకొని

పోయింది. మనవాడి కళ్యాణంలో దానిలాస్యం చూసే భాగ్యం ఆ వూరు నోచుకోలేదు. తాతయ్య యీలోపునే నా కెందు కీక్షుద్రపట్టీలు అని వినడంతప్ప చూడడం మానేశాడు.

నాటికి నేడు, నడివీధిలో నిలవేసి 'బాగున్నారా?' ఈకథ మనవాడిని ప్రశ్నించింది.

మనవాడు బదులు – నడిచేడు.

అది వేరే కథ.